క్లుప్తంగా

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న సంతోష్

చొప్పదండి: మండలానికి చెందిన పలువురు జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికయ్యారు. ఇంటర్ విద్యార్థి ఆయాన్ష్ బ్రౌంజ్ మెడల్, పదో తరగతి విద్యార్థిని ఎస్ స్పందన గోల్డ్ మెడల్, జే. రాంచరణ్ గోల్డ్ మెడల్ సాధించారు. ఇంటర్ డిస్ట్రిక్ట్ తైక్వాండో పోటీలలో వీరు ప్రతిభ కనబర్చగా స్పందన, రాంచరణ్‌లు త్వరలో ఉత్తరఖండ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని తైక్వాండో శిక్షకుడు సంతోష్ అభినందించారు.

క్షీరాభిషేకం

శంకరపట్నం: మూడు నెలల రేషన్ బియ్యాన్ని నిరుపేదలకు అందించడం సంతోషంగా ఉందని మండలంలోని కరీంపేటలో మంగళవారం పీఎం మోదీ చిత్రపటానికి లబ్ధిదారులతో కలిసి బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. రాబోయే వానాకాలంలో పేదలు ఆహారం కోసం ఇబ్బందులు పడకుండా మూడు నెలలు బియ్యం రేషన్ దుకాణాల ద్వారా అందిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రాసమల్ల శ్రీనివాస్, ఖాజాపాషా,శ్రీనివాస్, రాజేశ్, శివాజీ. అజయ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక

శంకరపట్నం: మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం 15వ విడత ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలో ఉపాధి హామీ పథకంలో 2024 ఏప్రిల్ 1 నుంచి మార్చి 2025 వరకు రూ.5.49 కోట్ల పనులు జరిగాయి. కూలీలకు వేతనాలు, మెటీరియల్ పేమెంట్ తదితర పనులకు సంబంధించిన సోషల్ ఆడిట్ సభ్యులు ప్రజావేదికలో గ్రామాల వారిగా చదివి వినిపించారు. రాత్రి వరకు సామాజిక తనిఖీ ప్రజావేదిక కొనసాగింది. కార్యక్రమంలో డీఆర్‌డీవో వేణుమాధవ్‌రెడ్డి, ఏపీడీ కృష్ణ, ఏవోఏ వెంకటేశ్వర్‌రెడ్డి, పీఎం సత్యనారాయణ, ఎస్ఆర్‌పీ బాలునాయక్, ఎంపీడీవో క్రిష్ణప్రసాద్, ఏపీవో శారద, టెక్నికల్ అసిస్టెంట్లు , పీల్డ్ అసిస్టెంట్లు, డీఆర్‌పీలు పాల్గొన్నారు.

భూవివాదంపై విచారణ

శంకరపట్నం: మండలంలోని ఎరడపల్లి గ్రామంలో భూ వివాదంపై మంగళవారం హుజూరాబాద్ రూరల్ సీఐ వెంకటి విచారణ చేశారు. గ్రామానికి చెందిన తక్కలపల్లి సత్యనారాయణ, కలకుంట్ల రవీందర్‌రావు, కలకుంట్ల సత్యనారాయణ మధ్య ఇళ్ల దారి విషయంలో భూ సమస్యలు ఉండడంతో క్షేత్రస్థాయి విచారణ చేశారు. వివాదాలకు తావులేకుండా సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవాలని ఇరువర్గాలకు సీఐ సూచించారు.

జీపీ నిధుల దుర్వినియోగంపై..



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీవో రాజేశ్వర్‌రావు

ఇల్లందకుంట: మండలంలోని సిరిసేడు గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగంపై ఎంపీవో రాజేశ్వర్‌రావు మంగళవారం విచారణ చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన కార్యదర్శి అంకూస్, గ్రామప్రత్యేక అధికారి వెంకటేశ్వర్లు నిధులు దుర్వినియోగం చేశారని, గ్రామానికి చెందిన జె. అనిల్ కలెక్టర్ పమేలా సత్పతి, జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశారు. డీపీవో ఆదేశాల మేరకు ఎంపీవో మంగళవారం జీపీలో రికార్డులు పరిశీలించారు. జీపీ రికార్డులను సీజ్ చేశామని, విచారణ అనంతరం తుది నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని తెలిపారు.

ఎంపికలో అవకతవకలు

చిగురుమామిడి: ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువవికాసం పథకం లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని, కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని సీపీఐ నాయకులు అన్నారు. మంగళవారం చిగురుమామిడిలోని ముస్కు రాజిరెడ్డి స్మారకభవనంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, మాజీ జెడ్పీటీసీ అందె స్వామి, మండలపార్టీ కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లు కాంగ్రెస్ కార్యకర్తలకే వచ్చాయని, గ్రామ కమిటీల్లో వారే ప్రాతినిధ్యం వహిస్తున్నారని, లబ్ధిదారుల నుంచి కొందరు డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. రాజీవ్ యువవికాస పథకం కింద ఇంటర్వ్యూలు నిర్వహించిన అధికారులు అర్హులను ఎంపికచేయకుండా అధికార పార్టీ నాయకులు చెప్పినవారినే ఎంపికచేశారని అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో రాత్రి పొద్దుపోయాక కాంగ్రెస్ నాయకులతో మంతనాలు జరిపి వారు చెప్పిన వారినే ఎంపిక చేసి జాబితాను కలెక్టర్‌కు పంపించారని, ఎంపీడీవో వైఖరిపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని, అర్హులకు పథకాలు అందకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఐ మండల సహాయకార్యదర్శులు సదాశివ, వెంకటేశ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు చిన్నస్వామి, శ్రీనివాస్‌రెడ్డి, మండల రైతు సంఘం కార్యదర్శి బాపురెడ్డి పాల్గొన్నారు.

ఈసారి తప్పని తిప్పలు

- కనపర్తి రోడ్డు సమస్య తీరేదెప్పుడో..
- రెండేళ్ల క్రితం తెగిపోయిన రోడ్డు
- ఇప్పటికీ మరమ్మతుకు నోచుకోని వైనం
- వర్షాకాలం ప్రారంభం.. ఆందోళనలో ప్రజలు

సాక్షి ఫోకస్



కనపర్తి-వీణవంక మధ్య తెగిపోయిన రోడ్డు

వీణవంక: రోడ్డు సమస్య ఏళ్లుగా పరిష్కారం కావడంలేదు. పాలకులు, అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తుడటంతో రెండు గ్రామాల ప్రజలకు ఇక్కట్లు తప్పేలా లేదు. అసలే వానాకాలం ప్రారంభమైంది. వర్షాలు భారీగా కురిస్తే రోడ్డు పూర్తిగా తెగిపోతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కనపర్తి- బేతిగల్ గ్రామాల మధ్య ఉన్న రోడ్డు కిలోమీటర్ మేర రెండేళ్ల క్రితం కురిసిన వర్షాలకు కొట్టుకుపోయింది. రోడ్డుకు ఇరువైపులా మూడు మీటర్ల లోతుతో గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ప్రయాణికులు, వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సిన దుస్థితి ఏర్పడింది. కనపర్తి -వీణవంక గ్రామాల మధ్య కూడా 300 మీటర్ల వరకు రోడ్డు తెగిపోయింది. వర్షాలు కురిస్తే రాకపోకలు నిలిచిపోతాయని రెండు గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏ చిన్న పనికైనా మండల కేంద్రానికి నిత్యం ప్రజలు వెళ్తుంటారు. అయితే వీణవంకకు వెళ్లే దారి తెగిపోవడంతో ప్రమాదకరంగా మారింది. ఆటోలు , ద్విచక్రవాహనాలు మాత్రమే ఈ దారి మీదుగా వెళ్తుంటాయి. ఇతర వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో అప్పటి మాజీ ఎంపీ వినోద్‌కుమార్, ప్రస్తుత ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తెగిపోయిన రోడ్డును సందర్శించి నిధుల మంజూరుకు కృషి చేశారు. కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రోడ్డు పనులు అటకెక్కాయి. వర్షాలు కురిస్తే మళ్లీ రోడ్డు తెగిపోయే ప్రమాదం ఉందని రెండు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రోడ్డు మరమ్మతు చర్యలైనా చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పేదల సొంతింటి కల నెరవేరుతోంది

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



ప్రొసీడింగ్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

మానకొండూర్‌రూరల్: రాష్ట్రంలో పేదల సొంతింటి కల నెరవేరుతోందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని ముంజంపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. అర్హులైన పేదలందరికి ఇండ్లు మంజూరు చేస్తామని, పైరవీలకు తావు లేదన్నారు. ఇళ్ల మంజూరు ఏటా జరుగుతుందని, రానివారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పేదలకు గూడు కల్పించడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కొందరు బీఆర్ఎస్ నాయకులు పనిగట్టుకొని ఇళ్ల పథకంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని, మూడు నెలల్లో ఇళ్ల నిర్మాణం మొదలు పెట్టకపోతే రద్దుచేసి మిగతా వారికి మంజూరు చేస్తామన్నారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. ధరణితో ఎదురైన భూ సమస్యలు భూభారతితో పరిష్కారమవుతాయన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను చక్కదిద్దేందుకే భూ భారతిని అమలు చేశామన్నారు. కొత్త చట్టంతో మేలు జరుగుతుందని భవిష్యత్‌లో ఎలాంటి సమస్య తలెత్తదన్నారు. భూ భారతి దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని, అధికారులు అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ వరలక్ష్మి, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఏఈ మహేశ్, నాయకులు రవీంద్రచారి, ఓదెలు, తిరుమల్‌రెడ్డి, సంపత్‌గౌడ్, సత్యనారాయణ, రమేశ్, జీడి శ్యాం, వరహాలచారి, రాజయ్య తదతరులు పాల్గొన్నారు.

మేలురకం విత్తనాలతోనే దిగుబడి





గంగాధర: విత్తనాలు అందజేస్తున్న చైర్‌పర్సన్ తదితరులు, రామడుగులో.. ఏవో త్రివేదిక, తదితరులు

గంగాధర: రైతులు పంటల సాగులో మేలు రకమైన విత్తనాలను ఎంపిక చేసుకోవడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్త రజనిదేవి సూచించారు. మంగళవారం మండలకేంద్రంలోని రైతువేదికలో నాణ్యమైన విత్తనం - రైతన్నకు నేస్తం కార్యక్రమం నిర్వహించారు. బూర్గుపల్లి, గంగాధర, కురిక్యాల, గర్శకుర్తి, మల్లాపూర్ క్లస్టర్ పరిధిలోని రైతులకు వరిలో దొడ్డురకం వరి విత్తనాలను అందించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రజిత, మండల ఏవో అధి కారి శ్రీనివాస్, విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

రామడుగు: నాణ్యమైన విత్తనాలతోనే మంచి దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి త్రివేదిక తెలిపారు. మండలకేంద్రంలోని రైతువేదికలో మంగళవారం నాణ్యమైన విత్తనం - రైతన్నకు నేస్తం నిర్వహించారు. రైతులకు 19 రెవెన్యూ గ్రామాలకు 38 వరి బస్తాలను (జేజీఎల్ 24423) రకం పది కిలోల బస్తాలు, 19 పెసర బ్యాగులను (3 కిలోలు)రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గోపాల్‌రావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుమల, కొక్కెరకుంట సింగిల్ విండో చైర్మన్ మురళీకృష్ణారెడ్డి, మానిటరింగ్ అధికారి సంపత్, ఏఈవోలు సంపత్, అనంత్‌రాజ్, రమేశ్, గోవర్దన్, ప్రసన్నకుమార్, సుమాంజలి, రైతులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వ్యవసాయ పనులు

మండలంలో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రైతులు పత్తి విత్తనాలు నాటే పనుల్లో నిమగ్నమయ్యారు. ఇటీవల వర్షాలు కురవడంతో దుక్కులు సిద్ధం చేసుకున్న రైతులు విత్తనాలు నాటుతున్నారు. కాగా వర్షాలు కురిసినట్లయితే ముందస్తుగా నాటిన పత్తి విత్తనాలు మొలుకెత్తుతాయని రైతులు తెలిపారు.

క్రైం వార్తలు

బైక్ చోరీ

జమ్మికుంట: పట్టణంలోని గొర్ల అంగడిలో పార్కింగ్ చేసిన బైక్‌ను దొంగలు చోరీ చేశారు. టౌన్ సీఐ ఎస్ రామకృష్ణ తెలిపిన వివరాలు.. మండలంలోని మాచపల్లికి చెందిన కాశవీన తిరుపతి బైక్‌ను పార్కింగ్ చేసి అంగడిలోకి వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి బైక్ కనబడలేదు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామన్నారు.

ఆయన కళ్లు సజీవం

జమ్మికుంట: పట్టణానికి చెందిన ఎలిమిళ్ల పుల్లయ్య (86) మంగళవారం మృతి చెందాడు. కరీంనగర్ జిల్లా సదాశయ ఫౌండేషన్ అధ్యక్షుడు నరహరి ఆధ్వర్యంలో కరీంనగర్ ఎల్‌వీపీ టెక్నీషియన్స్ సతీష్ సహకారంతో మృతుడి కళ్లు సేకరించి హైదరాబాద్‌లో ఎల్‌వీపీ ఐ బ్యాంక్‌కు పంపించారు. పుల్లయ్య కుటుంబ సభ్యులకు సదాశయ ఫౌండేషన్ నిర్వాహకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

పారిశుధ్య కార్మికుడి మృతి

గన్నేరువరం: మండలంలోని జంగపల్లికి చెందిన పారిశుధ్య కార్మికుడు పుర్ర పోశయ్య అనారోగ్యం మంగళవారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. కుమారుడు రాములు జీపీలో పంపు ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

గంగాధర: ఎలగందల్ నుంచి మండలంలోని గర్శకుర్తికి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం పట్టుకున్నట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. కొత్తపల్లి మండలం ఎలగందలకు రెండు ట్రాక్టర్లు అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నాయని, వాటిని పట్టుకుని ట్రాక్టర్లను సీజ్ చేసి డ్రైవర్, యాజమానులపై కేసు నమోదు చేశామన్నారు.

ఇసుక లారీల అడ్డగింత

మానకొండూర్ రూరల్: మండల కేంద్రంలోని పల్లెమీద చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ఇసుక లారీలను అడ్డుకున్నారు. అధిక లోడ్‌తో రోడ్లు చెడిపోతున్నాయని, ట్రాఫిక్ జామైతుందన్నారు. గ్రామం లోపలి నుంచి అధిక సంఖ్యలో లారీలు రావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. నాయకులు, అధికారులు ఇసుక లారీలను గ్రామం లోపలి నుంచి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

గంజాయి విక్రేత అరెస్ట్

కొత్తపల్లి: బావుపేటలో మంగళవారం నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో గంజాయి విక్రేతను అరెస్టు చేసి 1.2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని రాంరెడ్డి చికెన్ సెంటర్ ఎదుట ఒక వ్యక్తి నల్లని పాలిథిన్ కవర్‌తో పారిపోవడానికి ప్రయత్నిస్తుండగా.. పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి చేతిలోని కవర్‌ను తనిఖీ చేయగా.. అందులో గంజాయి వాసన కలిగిన పువ్వులు, మొగ్గలు లభించాయి. విచారణలో నిందితుడు తన పేరు రాంపర్వేష్ సాయిని(46), బీహార్ రాష్ట్రానికి చెందినవాడినని తెలిపాడు. కొంతకాలంగా కూలి పని నిమిత్తం బీహార్ నుంచి బావుపేట గ్రామానికి వచ్చి గ్రానైట్ కంపెనీలో పని చేస్తున్నట్లు పేర్కొన్నాడు. ఇక్కడ గంజాయి అలవాటు ఉన్నవారికి గంజాయిని విక్రయించి సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో బీహార్ వెళ్లి అక్కడ గుర్తుతెలియని వ్యక్తి వద్ద తక్కువ ధరకు గంజాయి కొని, ఇక్కడికి తీసుకొచ్చి చిన్నచిన్న ప్యాకెట్లుగా తయారు చేసి ఒక్కో ప్యాకెట్‌ను రూ.500 చొప్పున అమ్ముతున్నట్లు ఒప్పుకున్నాడు. ఎవరికైనా అమ్మాలని అక్కడే నిలబడి ఉన్నట్లు తెలిపాడు. ఎస్ఐ సాంబమూర్తి పంచనామా నిర్వహించి నిందితుడి వద్ద ఉన్న గంజాయిని తూకం వేయగా.. సుమారు కిలో 200గ్రాముల గంజాయి ఉన్నట్లు తేలింది. గంజాయి, నిందితుడి వద్ద ఉన్న సెల్‌ఫోన్‌ను స్వాధీనపరచుకొని నిందితుడు రాంపర్వేష్ సాయినిని అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి చర్యల నిమిత్తం కోర్టుకు తరలించనున్నట్లు పోలీసులు తెలిపారు. సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్ఐ సాంబమూర్తి, సిబ్బందిని సీపీ గౌస్ ఆలం, ఏసీపీ శుభం ప్రకాశ్ అభినందించారు.

నూతన కార్యవర్గం



ఎన్నికైన పంచాయతీ కార్యదర్శులు

మానకొండూర్‌రూరల్: మండలంలోని పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గం ఎన్నికలు మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో వరలక్ష్మి అధ్యక్షతన, ఎన్నికల అధికారి ఎంపీఓ కిరణ్ ఆధ్వర్యంలో జరిగాయి. మండల అధ్యక్షుడిగా కిరణ్‌కుమార్, గౌరవ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి, ఉపాధ్యక్షురాలిగా ఎ.పద్మలత, ప్రధానకార్యదర్శి వేముల జయరాజ్, కోశాధికారి సుష్మిత తదితరులు ఎన్నికయ్యారు. ఈసందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ప్రభుత్వ సంక్షేమ పథకాల కార్యక్రమాలు విజయవంతం చేస్తామని అన్నారు.

7 నుంచి జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు



మాట్లాడుతున్న ఉపేందర్‌రావు

కరీంనగర్‌స్పోర్ట్స్: జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 7, 8ల్లో జిల్లాస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించనున్నామని జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ సీనియర్ ఉపాధ్యక్షుడు వై.ఉపేందర్‌రావు తెలిపారు. మంగళవారం సాయంత్రం కరీంనగర్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అండర్ 11, 13, 15, 17, 19, ఓపెన్ మెన్, వుమెన్ విభాగాల్లో వయస్సులవారీగా ఈ పోటీలను నిర్వహించనున్నామన్నారు. 35, 40, 45, 50, 55, 60, 65, 70, 75 పైవయస్సు విభాగాల్లో సింగిల్స్, డబుల్ అంశాల్లో పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందించడంతోపాటు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారులను ఎంపిక చేయనున్నామని పేర్కొన్నారు. ఈ పోటీలను రెండు రోజులపాటు కరీంనగర్, రెవెన్యూ క్లబ్బుల్లో నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న జిల్లాలోని క్రీడాకారులు ఈనెల 6న సాయంత్రం 5 గంటల్లోపు తమ ఎంట్రీలను షటిల్ కోచ్ రవి వద్ద ఎంట్రీ ఫీజు చెల్లించి నమోదు చేసుకోవాలన్నారు. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ నిర్వహణ కార్యదర్శి రవి, పోటీల నిర్వహణ కమిటీ చైర్మన్ ఆనంద్‌కుమార్, జగిత్యాల జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.రామ్‌మోహన్‌రావు, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సంకల్ప్ అభియాన్ శిక్షణ

వీణవంక: మండలంలోని వల్భాపూర్ రైతువేదికలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ ఇచ్చారు. రైతులకు పంటల సాగులో చేపట్టవల్సిన చర్యలు, నూతన సాంకేతిక పరిజ్ఞానంపై భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి నుంచి డా.కృష్ణవేణి, కేవీకే సీనియర్ శాస్త్రవేత్త రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మహేశ్, ప్రభాకర్, వ్యవసాయ అధికారి గణేశ్, ఏఈవో సంగీత ఉన్నారు.

తన్నీరు హరీశ్‌రావు జన్మదిన వేడుకలు



హుజూరాబాద్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద మంగళవారం సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు జన్మదిన వేడుకలు నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ప్రజాసేవలో హరీశ్‌రావు ప్రత్యేక గుర్తింపు పొందారని పేర్కొన్నారు. ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ రాధిక, నీటి సంఘం రాష్ట్ర నాయకులు, మాజీ కౌన్సిలర్లు,వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.



రామడుగు: మండలంలోని దేశరాజ్‌పల్లి గ్రామ సమీపంలోని లింగారెడ్డి కుంట వద్ద ఉన్న దంపింగ్‌యార్డుతో ఇబ్బందిగా ఉందని గ్రామానికి చెందిన పలువురు వాపోతున్నారు. జంతు కళేబరాలు, చెత్త కారణంగా దుర్వాసన భరించలేకపోతున్నామని పలుమార్లు అధికారులకు విన్నవించినా స్పందన కరువైందని ఆవేదన చెందుతున్నారు. ఇకనైనా సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రాజేశ్వరి, ఎంపీడీవో, రామడుగు సెల్ నం : 96403 33888

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

బక్రీద్ పండుగకు ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ పమేలా సత్పతి



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ కల్చరల్: బక్రీద్ పండుగకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. ఈనెల 7న బక్రీద్ పండుగ నేపథ్యంలో జిల్లా సమన్వయ కమిటీ సమావేశం మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంతో కలిసి కలెక్టర్ ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా పండుగ నిర్వహణ ఏర్పాట్లకు సంబంధించి ముస్లిం మత పెద్దలు పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. బక్రీద్ పండుగ నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఈద్గాల వద్ద అన్ని వసతులు కల్పించాలని, తాగునీరు ఏర్పాటు చేయాలని అన్నారు. నమాజ్ వేళల్లో విద్యుత్ అంతరాయం లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మసీదుల వద్ద పారిశుధ్య చర్యలు చేపట్టాలని, చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా వేస్టేజ్ కవర్లను పంపిణీ చేయాలన్నారు. ఇళ్లకు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు రాకుండా చూడాలని అన్నారు. ప్రశాంత వాతావరణంలో పండగ నిర్వహించుకోవాలన్నారు. సీపీ మాట్లాడుతూ.. పండుగ సందర్భంగా పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు. అడిషనల్ కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, డీఆర్‌వో వెంకటేశ్వర్లు, ఆర్డీవో మహేశ్వర్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి పవన్‌కుమార్, ముస్లిం మైనారిటీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రొసీడింగ్స్ అందజేత

జమ్మికుంట: మండలంలోని మాచనపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్‌ను యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్లపల్లి నాగరాజు, కమిటీ నాయకులు లబ్ధిదారులకు మంగళవారం అందజేశారు.అనంతరం ఇంటి నిర్మాణం కోసం ముగ్గులు పోశారు. ప్రజా పాలనకు నిదర్శనంగా దశాబ్ద కాలం తర్వాత పేదల ఇంటి కల నెరవేరిందన్నారు. కార్యక్రమంలో బోలవేన శంకర్, వేల్పుల ప్రశాంత్, కమిటి సభ్యులు గుర్రపు సంపత్ రెడ్డి, వేల్పుల మేఘన, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

హుజూరాబాద్ : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు.మంగళవారం ఎంఆర్సీలో వినతి పత్రం అందజేశారు.అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలని,ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను భర్తీ చేయాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు, వసతులు లేక విద్యా సంవత్సరం ప్రారంభంలోనే వెల వెలబోతున్నాయని, మరుగుదొడ్లు శుభ్రం చేయాలని, పాఠశాలలు ప్రారంభానికి ముందుగానే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. వంట గదులు శుభ్రంగా ఉంచుకోవాలని,పాఠశాలల్లో మంచినీటి సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు అధ్యక్ష, కార్యదర్శులు దొమ్మాటి వేణుగోపాల్,రాంపెల్లి రోహిత్,గణేష్,వెంకటేష్, రాహుల్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు

హుజూరాబాద్ : మున్సిపల్ పరిధిలోని 23వ వార్డులో బుడగ జంగాల కాలనీలో మంగళవారం మున్సిపల్ ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించినట్లు మున్సిపల్ కమిషనర్ కే. సమ్మయ్య తెలిపారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా పనులు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ ఆర్. భూపాల్‌రెడ్డి,జూనియర్ సహాయకులు, వార్డు అధికారులు, శానిటరీ జవాన్లు, మెప్మా ఆర్పీలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు



జమ్మికుంట: రెవెన్యూ సదస్సును పరిశీలిస్తున్న ఆర్డీవో రమేశ్‌బాబు, తహసీల్దార్ వెంకట్‌రెడ్డి

హుజూరాబాద్: భూ సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు ఉపయోగించుకోవాలని హుజూరాబాద్ తహసీల్దార్ కె.కనకయ్య అన్నారు. భూ భారతి చట్టంపై మంగళవారం నుంచి మండలంలో రెవెన్యూ సదస్సులు ప్రారంభమయ్యాయని, మొదటి రోజు ధర్మరాజుపల్లి గ్రామంలో సదస్సు నిర్వహించగా 12 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు.

జమ్మికుంట: మండలంలోని విలాసాగర్ గ్రామంలో తహసీల్దార్ నల్ల వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో భూ భారతి రెవెన్యూ సదస్సు ప్రారంభించారు. హుజూరాబాద్ ఆర్డీవో రమేష్‌బాబు రెవెన్యూ సదస్సును పరిశీలించారు. భూ సమస్యలపై 71 మంది దరఖాస్తు చేసుకున్నారు.

వీణవంక: రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని హుజూరాబాద్ ఆర్డీవో రమేశ్ బాబు అన్నారు. మండలంలోని బేతిగల్ గ్రామంలో భూ భారతి చట్టంపై తహసీల్దార్ రజిత ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకొని అర్జీలను స్వీకరించారు.

చొప్పదండి: మండలంలోని భూపాలపట్నం గ్రామంలో అధికారులు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. ప్రతిరోజు ఒక గ్రామంలో సదస్సు నిర్వహిస్తున్నామని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ నవీన్ కుమార్ కోరారు.

గంగాధర: భూ సమస్యల పరిష్కారానికి గ్రామాలలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ అనుపమరావు ప్రజలకు సూచించారు. ఇస్లాంపూర్, కాచిరెడ్డిపల్లి గ్రామాలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో పాల్గొన్నారు. రెవెన్యూ సదస్సుల్లో డిటీ వినయ్‌కుమార్, ఆర్ఐలు, విఆర్వోలు పాల్గొన్నారు.

చిగురుమామిడి: భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని తహసీల్దార్ ఎం రమేశ్ తెలిపారు. మండలంలోని కొండాపూర్‌లో భూ భారతి సదస్సు నిర్వహించారు. హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతిగా వ్యవహరిస్తోందని, ధరణితో రైతులు ఆగమాగమయ్యారని అన్నారు. గ్రామంలో 33 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు.

గన్నేరువరం: మండలంలోని యాస్వాడలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఐదు దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ నరేందర్ తెలిపారు.

శంకరపట్నం: మండలంలోని మెట్‌పల్లిలో రెవెన్యూ సదస్సును హుజూరాబాద్ ఆర్డీవో రమేశ్‌బాబు ప్రారంభించారు. గ్రామానికి చెందిన 179 మంది రైతులు దరఖాస్తులు అందించారు.